# కమలంలో కట్టు తప్పిన క్రమశిక్షణ

- రాష్ట్ర అధ్యక్షుడి ముందే ఇద్దరి నేతల మధ్య దూషణల పర్వం
- జిల్లా కార్యకర్తల విస్మయం

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



కమల దళంలో అంతర్గత విభేదాలు మళ్లీ బహిర్గతమై క్రమశిక్షణపై ప్రశ్నలు లేవనెత్తాయి. వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన బీజేపీ నాయకుడు ఏట మధుకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నేతల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.

పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ గోమాస శ్రీనివాస్, మాజీ ఎంపీ వెంకటేష్ నేతను పేరుతో కాకుండా అనుచిత పదజాలంతో సంభోదించడంతో వాతావరణం ఉద్రిక్తమైంది. దీనిపై వెంకటేష్ నేత ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అంతే ఘాటుగా సమాధానమిచ్చారు. దీంతో గోమాస శ్రీనివాస్ కూడా ప్రతిస్పందించడంతో పరిస్థితి క్షణాల్లో ఉద్రిక్తంగా మారింది. అక్కడున్న నాయకులు, కార్యకర్తలు ఇద్దరినీ శాంతింపజేశారు. ఈ ఘర్షణ మొత్తం రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమక్షంలోనే జరగడం గమనార్హం. బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వడానికి వెళ్లిన నేతలు దూషణలకు దిగడం పార్టీ కార్యకర్తలను విస్మయానికి గురి చేసింది. పార్టీలో క్రమశిక్షణ లోపం స్పష్టమవడంతో నాయకత్వం ఇబ్బందుల్లో పడింది. కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల సమయంలో నేతల మధ్య ఈ రకమైన విభేదాలు పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని స్థానిక నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# కదులుతున్న బస్సులో మంటలు

- ప్రయాణికుల్లో 15 మంది సజీవ దహనం

**జైసల్మేర్,అక్టోబర్14 :**



రాజస్థాన్ జైసల్మేర్‌లో ఓ ప్రైవేట్ బస్సు ఘోర అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 20 మంది సజీవ దహనం కాగా, 16 మంది తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్‌కు వెళ్తున్న బస్సు వార్ మ్యూజియం సమీపంలో ఉన్నప్పుడు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో బస్సు లో 50కి మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు.. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జవహర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా ఈ అగ్ని ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. ఈ అగ్నిప్రమాదంపై జిల్లా కలెక్టర్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ, బాధితులకు తక్షణ సహాయం, వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

"ప్రయాణికుల బస్సు మధ్యాహ్నం 3 గంటల సమయంలో జైసల్మేర్ నుంచి దిల్లీకి బయలుదేరింది. వారిలో చాలా మంది జోధ్‌పూర్‌కు వెళ్తున్నవారు ఉన్నారు. థైయత్ గ్రామం సమీపంలోని ఆర్మీ వార్ మ్యూజియం దాటి దాదాపు 20 కి.మీ దూరం వెళ్లన తరువాత, అకస్మాత్తుగా బస్సు వెనుక భాగం నుంచి పొగ రావడం ప్రారంభమైంది. తరువాత కొద్ది క్షణాల్లోనే వాహనం మొత్తం మంటలు వ్యాపించాయి. దీనితో అందులోని ప్రయాణికులు చాలా మంది కాలిపోయారు. అయితే మంటలు ఎలా వ్యాపించాయో ఇంకా తెలియరాలేదు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం, పోలీసులు, ఆర్మీ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఓ గంట పాటు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించారు" అని పోలీసులు తెలిపారు. మరో వైపు 'రోడ్డుపై పెద్ద ఎత్తున పొగ ఎగసి పడడం చూసి, అక్కడకు వెళ్లాను. తక్షణమే బాధితులను అక్కడ నుంచి తరలించే ప్రయత్నం చేశాను. ఇది జరిగిన సుమారు 50 నిమిషాల తర్వాత పోలీ సులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చారు' అని ప్రత్యక్ష సాక్షి మహేంద్ర సింగ్ తెలిపారు.

**విచారం వ్యక్తం చేసిన సీఎం**

జైసల్మేర్ బస్సు ప్రమాదంపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, బాధితులకు సాధ్యమైనంత సహాయం చేయాలని ఆదేశించారు.

> "జైసల్మేర్ బస్సు అగ్నిప్రమాదానికి గురికావడం చాలా హృదయ విదారకం. ఈ ప్రమాద బాధితులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారికి సరైన చికిత్స అందించాలని, సాధ్యమైనంత సాయం చేయాలని అధికారులను ఆదేశించాను."
> -భజన్‌లాల్, రాజస్థాన్ ముఖ్యమంత్రి

మరోవైపు ఈ దుర్ఘటనపై మాజీ సీఎం అశోక్ గహ్లోత్, డిప్యూటీ సీఎం దియా కుమారి, సచిన్ పైలెట్ సహా పలువురు నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. 19 మంది ప్రయాణికులు బస్సులోనే మృత్యువాతపడ్డారని, మరొకరు జోధ్‌పూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారని పోఖ్రాన్ ఎమ్మెల్యే ప్రతాప్ పురీ (బీజేపీ) తెలిపారు.

# శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సు రద్దు

- దగ్గు మందు మరణాలతో తమిళనాడు నిర్ణయం

**చెన్నై,అక్టోబర్14 :**

శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సును తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ శాఖ రద్దు చేసింది. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ చేస్తున్న ఆ కంపెనీ లైసెన్సును రద్దు చేస్తున్నట్లు డ్రగ్స్ శాఖ వెల్లడిరచింది. కోల్డ్రిఫ్ దగ్గుమందులో ప్రాణాంతకమైన డైఇథలీన్ గ్లైకాల్ ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో 21 మంది చిన్నారుల మృతికి కారణమైన ఆ ప్రాణాంతక ఔషధం ఆ దగ్గుమందులో ఉన్నట్లు గుర్తించారు. తమిళనాడు సర్కారు 2011లో శ్రీసన్ ఫార్మసీ కంపెనీకి దగ్గుమందు తయారీకి లైసెన్సు జారీ చేసింది. 2016లో ఆ లైసెన్సుకు రెన్యూవల్ చేశారు. శ్రీసన్ కంపెనీ లైసెన్సు రద్దు చేసి, దాన్ని పూర్తిగా మూసివేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర డ్రగ్ తయారీ కంపెనీలపై తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు శ్రీసన్ ఫార్మసిట్యుకల్స్‌తో పాటు కొందరు డ్రగ్ అధికారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేపట్టింది. మధ్యప్రదేశ్ డ్రగ్స్ కంట్రోల్ శాఖ అక్టోబర్ ఒకటో తేదీన తమిళనాడు అధికారులకు ఆ దగ్గుమందుపై అలర్ట్ జారీ చేసింది. కోల్డ్రిఫ్‌తో పాటు అయిదు రకాల ఉత్పత్తులను చెన్నై ల్యాబ్‌లో పరిశీలించారు. దగ్గు సిరప్‌లో ప్రాణాంతకమైన డీఈజీ ఉన్నట్లు గుర్తించారు. అక్టోబర్ 9వ తేదీన మధ్యప్రదేశ్ పోలీసులు కంపెనీ ఓనర్ రంగనాథన్‌ను అరెస్టు చేశారు. 2023లో సరైన రీతిలో తనిఖీలు నిర్వహించని ఇద్దరు తమిళనాడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను కూడా సస్పెండ్ చేశారు

# ఒప్పంద సేవల పద్ధతిలో పోస్టుల భర్తీ

- 18న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

తెలంగాణ వైద్య విధాన పరిషత్, జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయం పరిధిలోని ఆసుపత్రులలో ఒప్పంద సేవల పద్ధతిన పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు డాక్టర్ ఎం.కోటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 8సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు (2 జనరల్ మెడిసిన్, ఒక గైనకాలజిస్ట్, 2అనస్తీషియాలజీ, ఒక పల్మనరీ మెడిసిన్, రెండు పీడియాట్రిక్స్) పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని, అభ్యర్థులు ఎంబీబీఎస్‌తో పాటు సంబంధిత స్పెషలిటీలో డిగ్రీ / డిప్లొమా కలిగి ఉండి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లో నమోదై ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ లోని ఎఫ్ – 24 లోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయంలో పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని, ఇతర వివరాలకు www. mancherial. telangana. gov.in వెబ్ సైట్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు

- టీజీఎండీసీ పీఓ రామకృష్ణ

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని టిజీఎండీసీ మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల ప్రాజెక్టు అధికారి పీ రామకృష్ణ మంగళ వారం తెలిపారు. ఇసుక మాఫియా కొనసాగుతుందని, అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారని సామాజిక మాధ్యమాలలో వస్తున్న అవాస్తవ కథనాలలో ఎలాంటి నిజం లేదన్నారు. జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక రవాణా పారదర్శకంగా లబ్ధిదారులకు అందుతుందని, ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అసంబద్ధమైన, అవాస్తవ ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు.

# 44.6 కిలోల గంజాయి స్వాధీనం

- భద్రాచలం ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద పట్టివేత
- ముగ్గురి అరెస్టు

**శెనార్తి మీడియా, భద్రాద్రి కొత్తగూడెం:**




భద్రాచలం ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది 44.6 కిలోల ఎండు గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఏఈఎస్ తిరుపతి ఆధ్వర్యంలో ఎస్సై శ్రీహరి బృందం తనిఖీ చేసింది. సూర్యాపేటకు చెందిన బానోతు మహేష్, గుగులోతు అశోక్‌లు, బెంగళూరుకు చెందిన రిజ్వాన్ పాషా తదితరులు ఒడిశా నుండి గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. సారపాక, ఇరవెండి పరిధిలో నాటు సారాయి తయారీపై దాడులు చేసి 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అక్రమ రవాణా సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 1800-425-2523కు తెలియజేయాలని ఏఈఎస్ తిరుపతి కోరారు.

# పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక

- 16 నుంచి జిల్లాలో ఎంపిక ప్రక్రియ ప్రారంభం
- ఏఐసీసీ ప్రతినిధి నరేష్ కుమార్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**





రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచనలతో జరుగుతున్న 'సంఘటన్ సృజన్ అభియాన్'లో భాగంగా మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎంపికను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఏఐసీసీ ప్రతినిధి డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యలపై అవగాహన కలిగి, కార్యకర్తలతో కలిసి పనిచేసే నాయకుడిని ఎంపిక చేస్తామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వంశీ చందర్ సూచనలతో పీసీసీ కోఆర్డినేటర్లు శివలింగ్ శ్రీనివాస్, అనిల్ కుమార్, జ్యోతిలతో కలిసి ఈ ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ఎంపిక షెడ్యూల్**

జిల్లాలో అక్టోబర్ 16న మధ్యాహ్నం 4 గంటలకు పాత్రికేయుల సమావేశం, 5 గంటలకు జిల్లా స్థాయి నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించి డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు ఫారాలు అందజేస్తారు. 17న ఉదయం ఆసిఫాబాద్‌లో వన్ టు వన్ ఇంటర్వ్యూలు, మధ్యాహ్నం బెల్లంపల్లి నియోజకవర్గ స్థాయిలో సమా వేశం ఉంటుంది. 18న చెన్నూర్ నియోజకవర్గ సమావేశం, 19న డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసిన వారితో ముఖాముఖి జరపనున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో కార్యకర్తలు, ప్రజల అభిప్రాయాలు సేకరించి, ఆరుగురిని ఎంపిక చేసి అధిష్ఠానానికి పంపుతామని నరేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కోఆర్డినేటర్లు శివలింగ్ శ్రీనివాస్, అనిల్ కుమార్, జ్యోతిలు పాల్గొంటారని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక షెడ్యూల్‌ను ఖరారు చేసేందుకు ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకట స్వామి, గడ్డం వినోద్, కొక్కిరాల ప్రేంసాగర్ రావు, మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలతో హైదరాబాద్‌లో సమావేశమైనట్లు వెల్లడించారు

# సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కోరారుజ మంగళ వారం తన ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో లక్ష్యసాధనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తిచసే విధంగా ఆయా రైస్ మిల్లర్ల నిర్వాహకులు కృషి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు రైస్ మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ లక్ష్యాలను పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం ఖరీఫ్ 2025- 26 సంవత్సరానికి సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తుందని, ఈ నేపథ్యంలో రైస్ మిల్లులలో సి.ఎం.ఆర్. లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. బ్యాంకు గ్యారంటీ, డిఫాల్టర్ గా ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించడం జరగదని తెలిపారు. అనంతరం రైస్ మిల్లుల వారీగా పెండింగ్ ఉన్న సి.ఎం.ఆర్. లక్ష్యాల వివరాలను సమీక్షించి త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్బిట్రేషన్ రికార్డులను పరిశీలించిన కలెక్టర్**

ఆర్డీవో కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ రికార్డులను కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఆర్డీవో శ్రీనివాస్ రావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసి, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**కేజీబీవీలను సందర్శించిన కలెక్టర్**

జిల్లాలోని హాజీపూర్, లక్షెట్టిపేట మండల కేంద్రాల్లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)లను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో అన్ని సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు



# రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి సాయి ప్రదీప్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న, పీడీ సుదీప్ మంగళ వారం తెలి పారు. నిర్మల్ జిల్లాలో జరిగిన ఎస్జీఎఫ్ అం డర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో మంచిర్యాల రాజీవ్ నగర్ తెలం గాణ మోడల్ స్కూల్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ సీఈసీ విద్యార్థి సాయి ప్రదీప్ ప్రతిభ కన బర్చి ఈ నెల 15 నుంచి 17 వరకు రంగా రెడ్డి జిల్లా పటాన్ చెరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారని తెలి పారు. సాయి ప్రదీప్ ను కళాశాల అ ధ్యా పక బృందం, సిబ్బంది అభినందించారు.